## వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి : ఎస్పి

**సంగారెడ్డి టౌన్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** రానున్న వినాయన నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామాల్లో, పట్టణాల్లో ప్రతిష్టించుకునే గణనాథుల మండపాల ఏర్పాటుకు ముందస్తుగా పోలీసుల అనుమతులు తీసుకోవాలని నిర్వాహకులకు సంగారెడ్డి జిల్లా ఎస్పి పరితోష్ పంకజ్ సూచించారు. ఏకదంతుని నవరాత్రి ఉత్సవాలు, ఈద్ మిలాద్ఉన్ నబీ పండగల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఆయా మండల కేంద్రాల్లో వివిధ మతాలకు చెందిన పెద్దలతో పీస్‌కమిటీలు నిర్వహించాలని చెప్పారు. ఆయా పోలీసు ఠాణా అధికారి ప్రతి మండపాన్ని సందర్శించాలని, జనజీవనానికి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. లౌడ్ స్పీకర్స్, డిజేలను అనుమతించబోమని చెప్పారు. డిజేలు ఏర్పాటు చేస్తే నిర్వాహకులతో పాటు డిజె యజమానులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగూ మైకులు, స్పీకర్లు తక్కువ సౌండ్‌తో రాత్రి 10గంటల వరకు వినియోగించాలన్నారు. లంబోదరుడి నిమజ్జనం రోజున చెరువుల వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉండే విధంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. పుకార్లను నమ్మవద్దని హితువు పలికారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## శ్రీవిద్యాధరి క్షేత్ర నిర్వహణ అద్భుతం

**-సంతృప్తి వ్యక్తం చేసిన కంచి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ**

**వర్గల్, ఆగస్టు 19 (ప్రభాతవార్త):** కంచి పీఠం ఆధ్వర్యంలోని వర్గల్ శ్రీవిద్యాధరి క్షేత్ర నిర్వహణ, పనితీరు అద్భుతంగా ఉందని కంచి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతిస్వామీజీ స్పష్టం చేశారు. తిరుపతి క్షేత్రంలోని మహాపాదుకా కంచి మఠంలో చతుర్మాస్య దీక్షలోఉన్న స్వామివారిని మంగళవారం వర్గల్ క్షేత్ర వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో అభివృద్ధి కమిటీ సభ్యులు స్వామివారిని కలిసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా శ్రీ శారద స్మార్త వేద విద్యాలయం, క్షేత్ర నిర్వహణ, చేపడుతున్న నిర్మాణాలు, అభివృద్ధి పనులు, భవిష్యత్తు ప్రణాళిక కంచి స్వామివారికి వివరించారు. అలాగే సెప్టెంబర్ 22 నుండి ప్రారంభం కానున్న శ్రీ విద్యా ధరి శరన్నవ రాత్ర మహోత్సవాల నిర్వహణకు అనుమతి పొందుతూ స్వామివారిని ఆహ్వానించారు. శ్రీ కంచి పీఠం ఉత్తరాధికారి శ్రీసత్యచంద్రశేఖర సరస్వతి స్వామివారి పరిచయ కార్యక్రమం నిర్వహించగా, భక్తులకు చక్కటివసతులు కల్పిస్తూ గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా విలసిల్లాలని ఆకాంక్షించారు.



ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

## గర్భిణులు వైద్యులు సూచించిన ఆహారాన్ని తీసుకోవాలి

**సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి**

**ములుగు, ఆగస్టు 19 (ప్రభాతవార్త):** గర్భవతులు ప్రభుత్వ ఆసుపత్రి లోనే వైద్యం చేయించుకోవాలని, వైద్యులు సూచించిన పౌష్టికాహారం తీసుకోవాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి సూచించారు. మంగళ వారం ములుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శిం చారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పలు రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించడంతో పాటు రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున నీరు కలుషితమవుతుందని ప్రతి ఒక్కరూ నీటిని వేడిచేసి చల్లార్చిన తర్వాత సేవించాలని, ఎప్పటి భోజ నం అప్పుడు వండుకొని భుజించాలని తద్వారా రోగాల భారిన పడ కుండా ఉంటారని తెలిపారు. వైద్యులు ఆసుపత్రిలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ రోగులకు వైద్యం అందించాలని సూచించారు. ఆసుపత్రిలో రిజిస్టర్‌ను పరిశీలించిన కలెక్టర్ వైద్యులు, సిబ్బంది ఆసుపత్రికి సమయానికి చేరుకోవాలని సూచించారు. కాగా ఆసుపత్రికి మిషన్ భగీరథ నీటి పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వాలని మెడికల్ ఆఫీసర్ కలెక్టర్‌ను కోరగా వెంటనే సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా కలెక్టర్ ఆదేశించారు.

## గండిపడిన చెరువులను పరిశీలించిన అదనపు కలెక్టర్



బట్టికుంట చెరువుకు పడిన గండిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

**అల్లాదుర్గం, ఆగస్టు 19, ప్రభాతవార్త:** మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గండ్లు పడిన చెరువులను, కూలిన ప్రాంతాలను అదనపు కలెక్టర్ నగేష్ మంగళవారం పరిశీలించారు. అల్లాదుర్గంలో బట్టి కుంట చెరువుకట్టకు పడిన గండి ప్రాంతాన్ని నగేష్ పరిశీలించారు. మండలం లోని సిల్వర్ పెద్దచెరువు కూలిన ప్రాంతాన్ని సందర్శించారు. మరమ్మతు పనులు చేపట్టాలని సంబధిత అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశం చారు. బట్టికుంట చెరువు నుంచి పొంగుతున్న నీరు రోడ్లపై పారుతూ ప్రయాణీకులకు ఇబ్బందులు కల్గిస్తోందని ప్రజలు అధికారి దృష్టికి తీసుకుపోయారు. 4 దశాబ్దాల క్రితం చెరువుకు గండిపడిందని, తిరిగి ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల మూలంగా మరో మారు చెరువుకు గండిపడిందని ప్రజల అధికారికి వివరించారు. చెరువుకు గండి పడటంతో వరద నీరంతా పంట పొలాల్లోకి చేరుకోవడంతో పంటలు నష్టపోయా యని రైతులు అధికారి ముందు కన్నీరు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అదనపు కలెక్టర్ నగేష్ వివరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కరుణాకర్, ఇరిగేషన్ ఈఈ రాంచందర్, డీఈ కిషన్, ఎంపిఓ లింగప్ప, ఏఈ వైష్ణవి, పంచాయితీ కార్యదర్శి ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

## ఆరవ రోజూ జలదిగ్బంధంలో అమ్మవారి ఆలయం



ఏడుపాయల బందోబస్తును పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ మహేందర్‌రెడ్డి

**పాపన్నపేట, ఆగస్టు 19, ప్రభాతవార్త :** ఏడుపాయల వన దుర్గ భవానిమాత ఆలయం ఆరో రోజు సైతం మంజీరా దిగ్బంధంలోనే ఉంది. ఘనపూర్ ఆనకట్ట ఎప్పటిలాగే పొంగిపొర్లుతుంది. ఆరురోజులుగా అమ్మ వారి ఆలయం చుట్టూ పెద్ద ఎత్తున నీరు ప్రవహిస్తుంది దీంతో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురంలో ఉంచి పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం నాటికన్నా కొద్ది మేర నీటిమట్టం తగ్గింది. మంగళవారం సాయంత్రం జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ మహేందర్ రెడ్డి, రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి,లతోకలిసిఏడుపాయలలో తమ సిబ్బందితో పరిస్థితి సమీక్షించారు. ఇకనుండి వర్షాలు తగ్గుముఖం పడితే త్వరలోనే అమ్మవారి ఆలయాన్ని పున ప్రారంభించే అవకాశం ఉన్నట్లు ఆలయ సిబ్బంది వెల్లడించారు. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ అక్కడే ఉండి ఎలాంటి ప్రమాదం జరగకుండా బందోబస్తు చర్యలు చేపట్టారు.

## యూరియా కోసం రైతుల ఇబ్బందులు

**అక్కన్నపేట, ఆగస్టు 19, ప్రభాతవార్త:** మండలకేంద్రంలో యూరియా అందుబాటులో లేకపోవడంతో మంగళవారం ఆగ్రో రైతు సేవ కేంద్రంలో ఒక యూరియా లోడ్ రావడంతో విషయం తెలుసుకున్న పరిసర ప్రాం తాల రైతులు పట్ట పాస్‌బుక్ జిరాక్స్ కాపీలతో క్యూలో నిలబడ్డారు. దీంతో దుకాణం యజమాని టోకెన్లు ఇచ్చి బుధవారం యూరియా బస్తాలు ఇస్తామని చెప్పమని చెప్పారు. ఒక రైతుకు రెండు బస్తాలు ఇవ్వ డంతో రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారు.



యూరియా కోసం బారులు తీరిన రైతులు

## భారీ వర్షాలు...అధికారులు అందుబాటులో ఉండాలి

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్**

**శివ్వంపేట, ఆగస్టు 19 (ప్రభాతవార్త) :** భారీవర్షాల దృష్ట్యా ప్రజలను అప్రమత్తం చేస్తూ అధికారులు అందుబాటులో ఉండి ప్రమాదాలు జరగకుండా చూడాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మండలంలోని ఉసిరికపల్లికి వెళ్లే రోడ్డు ఐదు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కల్వర్టు నుంచి నీరు వెళ్లకపోవడంతో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు వరదకు కొట్టుకుపోయింది. దీంతో ఉసిరికపల్లి, పోతులగూడ, పాంబండ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మంగళవారం జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ కోతకు గురైన రోడ్డును ఆర్ అండ్ బి అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం గుండ్లపల్లి గ్రామంలో నీటి కాల్వ తెగిపోయి నందున పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రాహుల్‌రాజ్ మాట్లాడుతూ భారీ వర్షాలు పడుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవసరమైతే తప్ప బయటికి రావద్దని సూచించారు. అదేవిధంగా అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజలకు సహకరించాలని ప్రమాదాలు జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు. నీటి వరదతో కొట్టుకపోయిన రోడ్డును వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి, తహసిల్దార్ కమలాద్రి, జిల్లా రైతు రక్షణ సమితి గౌరవ అధ్యక్షులు మైసయ్య యాదవ్ , అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



భారీ వర్షానికి కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అధికారులు



మంత్రి వివేక్‌వెంకటస్వామికి వినతిపత్రం అందజేస్తున్న దరిపల్లి చంద్రం

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర భవన నిర్మాణ రంగాల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం(బిఎన్ఆర్‌కెఎస్) అధ్యక్షులు దరిపల్లి చంద్రం మంగళవారం హైదారాబాద్‌లో రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామితో పాటు లేబర్ కమిషనర్ గంధార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మరణించిన కార్మికునికి రూ.10 లక్షలు, సాధారణ మరణం చెందితే రూ.2లక్షలు, అంగవైకల్యం కలిగిన వారికి రూ. 3లక్షల చొప్పున ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డు నుంచి చెల్లించాలని కోరారు. 50 యేండ్లు నిండిన కార్మికులకు రూ.5వేల పెన్షన్‌తో పాటు శాశ్వత కార్డు, భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి, లేబర్ కమిషనర్ గంగాధర్‌లు సానుకూలంగా స్పందించి సమస్యలనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చెలిమిల రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారి గంగాధర్ తదితరులు ఉన్నారు.

## సింగూరు పాఠశాలను సందర్శించిన డిఎంహెచ్ఓ



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి నాగనిర్మల

**పుల్‌కల్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** మండలంలోని సింగూరు సాంఘిక సంక్షేమ పాఠశాలను మంగళ వారం జిల్లా వైద్యాధికారి నాగ నిర్మల సందర్శించారు. పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు సీజనల్ జ్వరాలకు గురికాగా పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో విద్యార్థులు చికిత్సలు అందుకుని కోలుకుంటున్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని నాగ నిర్మల సందర్శించి వైద్యులకు, సిబ్బందికి, విద్యార్థులకు, ఉపా ధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలోని వసతులను నాగ నిర్మల పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, సేవలపై ఆరా తీయగా విద్యార్థులు సానుకూలంగా స్పందించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## బిసి వెల్ఫేర్ పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

**విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా...పరిసరాల పరిశుభ్రతపై ఆగ్రహం**

**నారాయణఖేడ్, ఆగస్టు 19,ప్రభాతవార్త :** మండలంలోని జుక్కల్ శివారు లోనీ మహాత్మ జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో కొద్ది రోజులుగా విద్యా ర్థులు అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకొని మంగళవారం ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి సందర్శించారు. హాస్టల్లో అనారోగ్యానికి గల కారణాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పరిసరాల పరిశుభ్రతపై ప్రిన్సి పాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే పరిశుభ్రతను పాటించాలని కాచి చల్లార్చిన నీళ్లను తాగాలని, వర్షాలకు సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ముందుగానే జాగ్రత్తలు పాటించాలని ఆయన విద్యార్థులకు సూచిం చారు. అనంతరం విద్యార్థులకు నాణ్యమైన వైద్యం అందివ్వాలని వైద్యులకు ఎమ్మెల్యే సూచించారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న ప్రిన్సి పాల్‌ను వెంటనే సస్పెండ్ చేసి కొత్తవారిని నియమించాలని, మెనూ ప్రకారం భోజనం పెట్టేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందిస్తూ ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడి ప్రధానాచార్యులను తొలగించేలా చర్యలుతీసుకోవాలని ఆదేశాలు చేశారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు డిప్యూటీ డిఎంహెచ్ఓ సంధ్యారాణి, వైద్యులు తరుని, అరవింద్, ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్‌సెట్, పండరిరెడ్డి మాజీ ఎంపీటీసీ పాల్గొన్నారు.

### జిల్లా రేషన్ డీలర్ల ఎన్నికలకు 11 మందితో నిర్వహణ కమిటీ

**సిద్దిపేట రూరల్, ఆగస్టు 19, ప్రభాతవార్త :** సిద్దిపేట రేషన్ డీలర్ల ఎన్ని కలు నిర్వహించేందుకు 11 మందితో కమిటీ ఏర్పాటు చేసినట్లు కమిటీ అధికారి చింతకింది వెంకటేశం(బెజ్జంకి) తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో 11 మందితో రేషన్ డీలర్ల నిర్వహణ కమిటీని ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా రేషన్‌డీలర్ల అధ్యక్ష,కార్యదర్శి, కోశాధికారి పోస్టు లకు ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈనెల 22న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నామినేషన్ల ప్రక్రియ ఉంటుందన్నారు. 25న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుంద న్నారు. నామినేషన్ పూర్తికాగానే అల్ఫాబెటికల్ అర్డర్‌లో గుర్తులను కేటాయిం చడం జరుగుతుందన్నారు. ఈనెల 31న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జిల్లా ఎన్నికలు నిర్వహించడం జరుగుతుంద న్నారు. నిర్ణయాన్ని 11 మంది ఎన్నికల నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో నిర్ణ యించినట్లు వివరించారు.కార్యక్రమంలో కమిటీ సభ్యులు కటకం మొనయ్య, రాధాశంకర్, పాక రమేష్, బండి తిరుపతి, నస్కంటి నాగరాజు(దుబ్బా), చింతల పర్శరాములు గజ్వేల్ రాజు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



కూలిన ఇండ్లను పరిశీలిస్తున్న గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు జైపాల్‌నాయక్

## ఇల్లు కూలిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

**-గిరిజన సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్**

**పుల్‌కల్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలోని పత్తికుంట తండాకు చెందిన తేజావత్ సునీత ఇల్లు కూలిపోయిందని, ప్రమాదంలో సునీత కుమారుడు కార్తీక్‌కు స్వల్ప గాయాలు అయ్యాయని గిరిజన సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు జైపాల్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం జైపాల్ నాయక్ జోగిపేట ఆసుపత్రిలో చికిత్స అందుకుంటున్న కార్తీక్‌ను పరామర్శించి తండాకు చేరుకుని గిరిజనుల పరిస్థితిపై వివరాలు సేకరించారు. ఇల్లు కూలిన వారిని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు పండిస్తున్న పంటలు నీట పాలయ్యాయని, ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని సూచించారు. జిల్లాలో ఇండ్లు కూలిపోయిన వారికి ప్రభుత్వం ఇండ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నేనావత్ రవీందర్, రమేష్ నాయక్, దేవుజా నాయక్, రంగారావ్, రాజు నాయక్, నేనావత్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సబ్ కలెక్టర్‌ను సన్మానించిన అంగన్‌వాడీ టీచర్లు

**నారాయణఖేడ్, ఆగస్టు 19 ప్రభాతవార్త :** నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా భారతిని అంగన్‌వాడీ టీచర్లు సన్మానించారు. ఈ సందర్భంగా నూతనంగా సబ్ కలెక్టర్ ఏర్పాటు చేయడంతో సబ్ కలెక్టర్‌ను నారాయణఖేడ్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్వాడీ టీచర్లు సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. అంగన్వాడి పిల్లలను అంగన్వాడీ సెంటర్లో ఆడుతూ పాడుతూ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకురాలు వీణకుమారి, నిర్మల, విద్యావతి, పుణ్యవతి, రాధా, సంగీత, జ్యోతి, విద్యావతి, రుక్మిణి, ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి చిరంజీవి, సతీష్, రాము, ఆశోక్ పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్‌ను సన్మానిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు.



ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించిన మహిళ

## ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన మహిళ

**కాపాడిన కానిస్టేబుల్**

**చేర్యాల, ఆగస్టు 19, ప్రభాతవార్త :** కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఓ మహిళను కానిస్టేబుల్ కాపాడాడు. చేర్యాల పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చేర్యాల పట్టణా నికి చెందిన పాక రాణి కుటుంబ సమస్యలతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం చేర్యాల పెద్దచెరవులో దూకి ఆత్మహత్యయత్నం చేసుకో పోగా అదే సమయంలో చెరువు కట్టపై వాకింగ్ వెళ్తున్న కానిస్టేబుల్ స్వామి గమనించి చెరువులోకి దూకి మహిళను కాపాడాడు. దీంతో స్థానికులు కానిస్టేబుల్‌ను అభినందించారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

**లక్షా 80 వేల నగదు, మూడు కార్లు, బైక్, సెల్‌ఫోన్లు స్వాధీనం**

**హత్నూర, ఆగస్టు 19, ప్రభాతవార్త:** హత్నూర గ్రామ శివారులోని సాగర్‌రావు ఫామ్ హౌస్‌లో పేకాటా అడుతున్న 14 మందిని సోమ వారం రాత్రి అదుపులోకి తీసుకొని ఒక లక్ష 80,650 రూపాయలు సాధీనం చేసుకోవడంతో పాటు 13 సెల్ ఫోన్లు, మూడు కార్లు ఒక బైక్, 104 పేకాట ముక్కలు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై శ్రీధర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. సోమవారం రాత్రి సాగర్‌రావు ఫామ్‌హౌస్‌పై దాడి చేసి వీరిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు. పేకాట ఆడుతూ పట్టుపడినవారిలో యాదుల్లా, మహేందర్, మల్లేశం, హను మంతు, వెంకట్‌రెడ్డి ఉపేందర్, గోపాల్, సతీష్ ఖాసీం, రాములు, లక్ష్మణ్, నరేష్, రాజేందర్ ఉన్నారని ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. వీరిని అరెస్టు చేసి న్యాయస్థానంలో ప్రవేశపెడతామని ఆయన తెలిపారు.

## పత్తి పంటలో గంజాయి మొక్కల సాగు

**నాగల్‌గిద్ద, ఆగస్టు 19, ప్రభాతవార్త:** పత్తి పంటలో అంతర్ పంటగా సాగుచేస్తున్న గంజాయి మొక్కలను మంగళవారం ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన మండల పరిధిలోని శ్యామ నాయక్ తండాలో జరిగింది. తండాకు చెందిన పిరునాయక్ తన వ్యవసాయ భూమిలో పత్తి పంటతో పాటు గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు తెలుసుకున్న ఎక్సైజ్ పోలీసులు పత్తి పంట సాగులో 105 గంజాయి మొక్కలను గుర్తించి మొక్కలను పీకేసి స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎక్సైజ్ సిఐ శంకర్, ఎస్ఐలు హనుమంతు, అనుదీప్, సిబ్బంది అరుణ, జ్యోతి, పండరి, రాజేష్, శివకృష్ణలు పాల్గొన్నారు.



గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుంటున్న ఎక్సైజ్ పోలీసులు

### యూరియా కొరత తీర్చాలని రాజీవ్ రహదారిపై

# బిఆర్ఎస్ శ్రేణులు ఆందోళన

**చిన్నకోడూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త :** యూరియా కొరత కాంగ్రెస్ సర్కార్ తెచ్చిన కొరత అని బిఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు కూర మాణిక్యరెడ్డి, కామిని శ్రీనివాస్, లింగంగౌడ్, జాప శ్రీకాంత్‌రెడ్డి, కోల రమేష్‌గౌడ్, కామిని ఉమేష్‌చంద్ర, ప్రభాకర్‌వర్మ అన్నారు. ఎరు వుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని...యూరియా కొరత తీర్చాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిద్దిపేట నియోజకవర్గ బిఆర్ ఎస్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఇబ్రహీంనగర్ రాజీవ్ రహదారిపై ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనేని యూరియా కొరత కాంగ్రెస్ సర్కారులో ఎలా వచ్చిందని ప్రశ్నించారు. రైతులకు ఎరువులు సరఫరా చేయడంలో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విఫలమైందన్నారు. గత సమాఖ్య పాలన లో కాంగ్రెస్ సర్కారు ఎట్లా అయితే క్యూలైన్‌లో కట్టి యూరియా కోసం పడిగాపులు కాశారో అట్టనే మళ్లి పునరావృతం అయిందన్నారు. కాంగ్రెస్ సర్కారు పూర్తిగా రైతుల పట్ల చిన్న చూపు చూస్తుందన్నారు. రైతులకు యూరియా సరఫరా చేయలేని సర్కారు వెంటనే గద్దె దిగాలన్నారు. రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయకుంటే రాబోయే రోజుల్లో ఆందోళనలో మరింత ఉధృతం చేస్తామన్నారు. బిఆర్ఎస్ ఆందోళనలతో రాజీవ్ రహదారిపై ట్రాఫిక్ తీవ్ర అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న ఎసిపి రవీందర్‌రెడ్డి, సిఐ శ్రీను,ఎస్ఐ సైఫ్ అలీ ఆందోళన కారులను శాంతింపజేసి ట్రాఫిక్‌ను క్లీయర్ చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మాజీ ప్రజాప్రతి నిధులు, పిఎసిఎస్ చైర్మన్లు, పార్టీ శ్రేణులు సుభాష్, గోవింద గిరిస్వామి, బాలయ్య, కనకరాజు, కుం టయ్య, మల్లయ్య, మరుపల్లి శ్రీనివాస్‌గౌడ్, అంజ నేయులు, మేడికాయల వెంకటేశం, ఇట్టబోయిన శ్రీనివాస్, కీసర పాపయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న బిఆర్ఎస్ శ్రేణులు

## వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

**సిర్గాపూర్, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లో లంబోదరుడిని ప్రతిష్ఠాపన చేసుకునే మండపాల ఏర్పాటుకు ముందస్తుగా పోలీసుల అనుమతి విధిగా తీసుకోవాలని ఎస్ఐ మహేష్ మండల ప్రజలకు సూచించారు. మండపాల నిర్వాహకులు పోలీసులు సూచించిన ఆన్‌లైన్‌లో మండపం వివరాలను పొందుపర్చి అనుమతి పొందాలని సూచించారు.

## శ్రీపద్మనాభస్వామి ఆలయంలో అన్నదానం

**చౌటకూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని చక్రియాల్‌లో కొలువున్న శ్రీపద్మనాభస్వామి ఆలయంలో శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి గ్రామస్థులతోపాటు పరిసరగ్రామాలనుంచి భక్తులుచేరుకుని ఆలయ అర్చకులు వేదమంత్రాలు వల్లిస్తుండగా భక్తులు ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు (అన్నదానం) అందచేశారు.

## పత్తిపంటలను పరిశీలించిన ఎడిఎ

**మనూర్, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
మండలంలో అధికవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు సాగుచేసుకుంటున్న పత్తి, పెసర, సోయ పంటలను మంగళవారం ఎడిఎ నూతన్ కుమార్ వ్యవసాయ అధికారులు, రైతులతో కలిసి పరిశీలించారు. మండల పరిధిలోని మాయికోడ్‌లో రైతులు పండిస్తున్న పత్తి పంటను పరిశీలించిన ఎడిఎ నూతన్‌కుమార్ రైతులకు పలుసూచనలు చేశారు. పంటల అధిక దిగుబడికి వర్షాలు కురుస్తున్నందున ఎరువులవినియోగం వాయిదా వేసుకోవాలని, వర్షాలు తగ్గాక ఎరువులను వేసుకోవాలన్నారు. మందుల పిచికారి సమయంలో త్రిబుల్19 మందు కలిపి పిచికారి చేయాలన్నారు. పంటలకు సోకిన తెగులునివారణకు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎట మహేష్‌చౌహాన్, ఎఈఓలు సంగమేశ్వర్, ప్రవీణ్, రైతులు శేరి సంగన్న, గాండ్ల రాజ్‌కుమార్, నాగేందర్‌రావు, నర్సింలు, వైజనాథ్ తదితరులు ఉన్నారు.

## నల్లవాగు ద్వారా 10 చెరువులను నింపుతాం

**-విలేకరులతో ఇరిగేషన్ ఈఈ సుందర్**

**సిర్గాపూర్, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
నల్లవాగు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా పది చెరువులను నింపడం జరుగుతుందని ఇరిగేషన్ ఈఈ డి.సుందర్ అన్నారు. మంగళవారం నల్లవాగు ప్రాజెక్టును సందర్శించిన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుందర్ మాట్లాడుతూ ప్రాజెక్టు ద్వారా 6030 ఎకరాలకు సాగు నీరు అందించే అవకాశం ఉందన్నారు. ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరకు నీటిని అందించేందుకు 80శాతం పనులు పూర్తి చేసినట్లు, మిగిలిన 20 శాతం సిసి నిర్మాణ పనులను వేయాల్సి ఉందని సుందర్ పేర్కొన్నారు.

## వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

**-నర్సాపూర్ ఎస్ఐ బి.లింగం**

**నర్సాపూర్, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
రానున్న వినాయకచవితి పండుగ సందర్భంగా నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నర్సాపూర్ పట్టణంతోపాటు గ్రామాలలో వినాయక మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా ఆన్లైన్లో దరఖాస్తుచేసుకొని అనుమతి పొందాలని నర్సాపూర్ ఎస్ఐ బి.లింగం తెలిపారు. మంగళవారం ఆయన పోలీస్‌స్టేషన్లో విలేకరులతో మాట్లాడుతూ వినాయక మండపాల ఏర్పాటుకు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకొని పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు కాపీ సమర్పించాలన్నారు. ప్రధాన రోడ్లలో మండపాలను ఏర్పాటు చేయవద్దని, రహదారులను క్లియర్‌గా ఉంచాలన్నారు, విద్యుత్ కనెక్షన్ సురక్షి తంగా అమర్చాలని, అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైనచర్యలు తీసుకోవా లన్నారు. ఎటువంటి సందేహాలు ఉన్నా నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ నెంబర్ 8712657897కు ఫోన్‌చేసి అలాగే గ్రామాల్లో విలేజ్ పోలీస్ ఆఫీసర్‌కు ఫోన్‌చేసి సమాచారంతెలుసుకోవాలని సూచించారు. అదేవిధంగా పోలీసుల తక్షణ సహాయం కోసం డయల్ 100కి కాల్‌చేసి ఉపయోగించుకోవాలని ఎస్ఐ బి.లింగం వెల్లడించారు.

## ఆశావర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి

**-సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు కదారి**



శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు

**కౌడిపల్లి, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
ఆశావర్కర్లకు రూ.18వేలు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని, పదోన్నతులు బీమా, పిఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగభద్రత తదితరసమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు కదారి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కౌడిపల్లిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. 2023 సెప్టెంబర్, అక్టోబర్ నెలలో ఆశావర్కర్ల నిరవధికసమ్మె సందర్భంగా ఉన్నతాధికారులు నిర్దిష్టమైన హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో శ్యామల, మంజుల, చెన్నమ్మ, అనురాధ, మంజుల, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

## నల్లవాగు ప్రాజెక్టును సందర్శించిన ఎమ్మెల్యే



నల్లవాగు ప్రాజెక్టును సందర్శించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**సిర్గాపూర్, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
మండలంలోని నల్లవాగు ప్రాజెక్టును మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అధికారులతో కలిసి సందర్శించారు. ఇటీవల భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రాజెక్టులోకి ఏ మేరకు వరద నీరు చేరుకుందో ఎమ్మెల్యే అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు మెయిన్ కాలువ ద్వార పంట సాగుకు నీటి ఎమ్మెల్యే అధికారులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్‌సేట్, సిడిసి మాజీచైర్మన్ నర్సింహారెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు, మాజీసర్పంచ్‌లు, నాయకులు పండరిరెడ్డి, శ్రీనుపాటిల్, మోహన్‌రెడ్డి జిత్తురెడ్డి, జ్ఞానేశ్వర్ పాటిల్, జైరాజ్, పురుషోత్తం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మామిడితోటల పునరుద్ధరణపై వీడియో కాన్ఫరెన్స్

**సదాశివపేట, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
మద్దికుంట రైతువేదికలో పాత మామిడితోటల పునరుద్ధరణమీద వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో భాగంగా మామిడిలో చేపట్టవలసిన కొమ్మ కత్తిరింపులమీద రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. అదేవిధంగా ఆయిల్‌పామ్ పంటల మీద అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో భాగంగా పండ్లు, కూరగాయలు, పూలను పెంచే రైతులకు ఉద్యానశాఖ రాయితీలు అందిస్తుందని తెలిపారు. ఆయిల్‌పాం సాగుకు ఎకరానికి 50వేల రూపాయల సబ్సిడీని అందిస్తుందని సదాశివపేట ఉద్యాన అధికారి సునీత తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రమేష్, ఉద్యాన విస్తరణ అధికారి సతీష్, ఆయిల్‌పాం అధికారి ఈశ్వర్ పాల్గొన్నారు.

# యూరియా కోసం బారులు తీరిన రైతులు

**-పోలీసుల పహారాలో యూరియా బస్తాల పంపిణీ**



యూరియా కోసం మన గ్రోమోర్ వద్ద పోలీసుల పహారాలో బారులు తీరిన రైతులు

**నర్సాపూర్ ఆగస్టు 19, ప్రభాతవార్త:**
ఈఖరీఫ్ సీజన్లో రైతులు పంటలు వేసి యూరియా ఎరువులు వేసే సమయం రాగానే యూరియా ఎరువుల కొరత నెలకొంది. దీంతో నర్సాపూర్ పట్టణంలోని మన గ్రోమోర్ వద్ద గత వారం రోజుల నుంచి నో స్టాక్ అని పెట్టినా రైతులు వారం రోజులు నుంచి యూరియా ఎరువుల కోసం తిరుగుతూనే ఉన్నారు. ఈ మేరకు మంగళవారం నర్సాపూర్ మన గ్రోమోర్ ఎరువుల దుకాణంలో యూరియా ఎరువు వచ్చిందని గ్రామాల రైతులకు తెలియగానే రైతులందరూ వచ్చి యూరియా ఎరువుల కోసం మన గ్రోమోర్ ఎరువుల దుకాణం ముందు క్యూలో బారులు తీరారు. కిక్కిరిసి ఉన్న రైతుల యూరియా కోసం ఎగబడుతున్న రైతులను సముదాయించడానికి పోలీసులను నిఘా ఉంచారు. ఈమేరకు పోలీసుల పహారాలో రైతులకు యూరియా ఎరువులను పంపిణీ చేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో యూరియా కోసం ఇన్ని ఇబ్బందులు ఎదుర్కొనే వారం కాదని ప్రస్తుత ప్రభుత్వం యూరియా ఎరువుల కొరత సృష్టించడంతో రైతులకు యూరియా ఎరువులు దక్కకుండా ఉన్నాయన్నారు. ఆరుగాలం కష్టించి వరి పంటలను వేస్తే యూరియా ఎరువుల కొరతతో తాము మరింతగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నర్సాపూర్ పట్టణంలో యూరియా ఎరువుల కోసం పడిగాపులు కాస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నర్సాపూర్ ప్రాంతానికి కావలసిన యోగ ఎరువులను పంపిణీ చేసి రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

## డప్పూర్ పాఠశాల ముందు విద్యార్థుల నిరసన



పాఠశాల ముందు నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, పోషకులు

**మనూర్, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని డప్పూర్ ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై పంపిన ఉపాధ్యాయులు విఠల్‌రెడ్డిని తిరిగి పాఠశాలకు రప్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం విద్యార్థులు, పోషకులు నిరసన వ్యక్తం చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయులు ఉన్నారన్న నమ్మకంతో తమ చిన్నారులను పాఠశాలకు పంపిస్తున్నామని, ఉపాధ్యాయులు లేని పాఠశాలకు తమ చిన్నారులను పంపితే ఒనగూరే ప్రయోజనం ఏమిటని అధికారులను పోషకులు ప్రశ్నించారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడిని తిరిగి పాఠశాలకు పంపాలని లేకుంటే తమచిన్నారులకు టిసిలు అందచేస్తే ఇతరపాఠశాలల్లో చేర్పించుకుంటామని పోషకులు పేర్కొంటున్నారు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులతో మెరుగైన విద్యను ఎలా అందిస్తారని పోషకులు విద్యాధికారులను ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బదిలీపై పంపిన ఉపాధ్యాయుడిని తిరిగి పాఠశాలకు పంపాలని డిమాండ్ చేశారు.

## కొండచిలువను రక్షించిన అటవీ అధికారులు



చేపలవలలో చిక్కిన కొండచిలువను రక్షించిన అటవీ అధికారులు

**నర్సాపూర్ ఆగస్టు 19, ప్రభాతవార్త:**
ఇటీవల భారీగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మంగళవారం నర్సాపూర్ రాయరావు చెరువులోకి ఒక కొండచిలువ కొట్టుకు వచ్చింది. ఈమేరకు మత్యకారులు రాయరావు చెరువులో వేసిన చేపల వలలో ఒక కొండచిలువ వచ్చి చిక్కింది. ఈ సమాచారం తెలుసుకున్న నర్సాపూర్ అటవీ శాఖ అధికారులు స్పందించి రేంజ్ అధికారి అరవింద్ ఆధ్వర్యంలో అటవీ శాఖ అధికారులు ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ సహకారంతో రక్షించారు. ఈనేపథ్యంలో చేపల వలలో చిక్కిన కొండచిలువను ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ అధికారులు పట్టుకొని అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో సంరక్షణ కేంద్రానికి పంపించారు. ఈ స్నేక్ రెస్క్యూ ఆపరేషన్ కార్యక్రమంలో నర్సాపూర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అరవింద్‌తోపాటు సెక్షన్ ఆఫీసర్ సాయిరాం, బీట్ ఆఫీసర్ గోపాల్‌రెడ్డి, అదేవిధంగా బెస్ట్ క్యాంప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీచేసిన ఎమ్మెల్యే

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
సంగారెడ్డి నియోజకవర్గంలోని వివిధ మండలాలు గ్రామాలకు చెందిన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే చింత ప్రభాకర్ చేతుల మీదుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. మొత్తం 1719000 రూపాయల విలువ గల 67 చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. మధ్యవర్తి లేకుండా నేరుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల దరఖాస్తు చేసుకోవచ్చని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ సూచించారు. కార్యక్రమంలో మాజీ సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ జడ్పిటిసి కొండల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆర్.వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షులు చక్రపాణి, విఠల్, కార్యదర్శి గోవర్ధన్, వరకుమార్, వివిధగ్రామాల మాజీ సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇరిగేషన్ అధికారుల తీరుపై మాజీ ఎమ్మెల్యే ఆగ్రహం

**అల్లాదుర్గం, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
ఇరిగేషన్ అధికారులు ముందస్తుగా చర్యలు తీసుకోవడంలో విఫలం అయినందునే వర్షాకాలంలో చెరువులకు గండ్లు పడుతున్నాయని, పంట పొలాల్లోకి వరద నీరు చేరుకుని పంటలను నాశనం చేస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం మండలకేంద్రమైన అల్లాదుర్గంలోని బట్టికుంట చెరువుకుంట చెరువుకట్ట తెగిపోయినట్లు తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చెరువును, రోడ్లపై ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలించారు. చెరువులకు గండ్లుపడినా, వర్షాలతో పంటలు నీటమునిగినా మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇంతవరకు స్పందించకుండా ఉండటం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి గండిపడిన చెరువులకు మరమ్మతులు చేయించి, నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పి.నర్సింలు, మండల నాయకులు అంజియాదవ్, సూర్యకుమార్, దశరథ్, మోహన్‌రాథోడ్, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఆశావర్కర్‌లకు కనీసవేతనం రూ.26వేలు చెల్లించాలి

**-ఉద్యోగ భద్రత కల్పించాలి, సౌకర్యాలు సమకూర్చాలి**
**-ఆశవర్కర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి**



ఆశావర్కర్స్ సభలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి

**జహీరాబాద్, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వైద్య సేవలు అందిస్తున్న ఆశావర్కర్‌లకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్‌తో పాటు ప్రతి నెల వేతనాలు అందేలా చూడాలని తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని భీంభవన్ ఫంక్షన్ హాల్‌లో యూనియన్ జిల్లా మహాసభలను నిర్వహించారు. ఈసందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశావర్కర్‌లపై చిన్నచూపు ప్రదర్శిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పుటమీ టెస్ట్, ఎఎన్సీ టార్గెట్‌లను రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. అందరి బాగోగులు చూసే ఆశావర్కర్‌ల ఆరోగ్యాలు పాడవుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. టార్గెట్‌లు నేరవేర్చకుంటే ఉద్యోగాలకు రాజీనామా చేయాలని హెచ్చరిస్తున్నారని విచారం వ్యక్తంచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలం బిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఆశావర్కర్లు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సాయిలు, సహాయ కార్యదర్శి ఎస్ మహిపాల్, నాయకులు లక్ష్మి, శశికళ, నందమ్మ, శ్యామల, శశిరేఖ, గంగ, ప్రశాంతి, విత్తాబాయి తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-కాంగ్రెస్‌పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్**

**నర్సాపూర్, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీవర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా ప్రజలు అవసరమైతే తప్ప బయటకు వెళ్ళవద్దన్నారు. జిల్లాలో వాగులు, వంకలు, చెరువులు, మత్తడులు పొంగి పొర్లుతున్నందున ఎవరు కూడా వాటిని దాటే ప్రయత్నం చేయకూడదన్నారు. మెదక్ జిల్లాతో పాటు నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలో పలు గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను వెంటనే ఖాళీ చేయించి ప్రభుత్వ కార్యాలయాల్లోనూ పాఠశాలల్లోనూ సంఘ భవనాల్లోనూ వారికి పునరావాసం కల్పించాలన్నారు. ఇంకా రెండు మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగిన స్థానిక కాంగ్రెస్ నాయకులు స్పందించి తగిన జాగ్రత్తలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# హల్దీ ప్రాజెక్టుకు గంగపూజ నిర్వహించిన ఎమ్మెల్యే



హల్దీ ప్రాజెక్టుకు గంగపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తదితరులు

**వెల్దుర్తి. ఆగస్టు 19, ప్రభాతవార్త:**
ఉమ్మడి మండలంలోని కొప్పుల పల్లి గ్రామం వద్దగల హల్దీ ప్రాజెక్టులో నీరు భారీగా చేరడంతో ఉప్పొంగిపొర్లుతుంది. దీంతో మంగళవారం నాడు నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి హల్దీ ప్రాజెక్టు వద్దకు చేరుకొని గంగా పూజలు నిర్వహించి నిర్వహించారు. అలాగే ఉప్పు లింగాపూర్ గ్రామ వద్ద గల బ్రిడ్జిపై నుండి నీరు భారీగా చేరి, ప్రవహిస్తుండడంతో అక్కడ సైతం ఎమ్మెల్యే చింతల లక్ష్మారెడ్డి గంగపూజ నిర్వహించి హల్దీ ప్రాజెక్టు పరిసరప్రాంత ప్రజలు రైతులు సుభిక్షంగా ఉండి పంటలు సస్యశ్యామలంగా పండాలని ఆమె కోరారు. అలాగే మాసాయిపేట మండలంలోని పార్టీలీడర్ షాపును సందర్శించి రైతులకు ఎరువులు సక్రమంగా అందజేయాలని వారికి అవసరం ఉన్న బస్తాలను ఇవ్వాలని ఆమె తెలిపారు. రైతులకు కావాల్సిన యూరియాను సరిపడా చేసినట్లయితే రైతులు తిరగాల్సిన అవసరం లేదని అందుకు రైతులకు కావలసినవి సరఫరాచేయాలని ఆమె ఫర్టిలైజర్ యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రమేష్‌గౌడ్, ఎంపిటిసి మోహన్‌రెడ్డి, నాకు కోదండ కృష్ణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, స్టేషన్ శ్రీనివాస్. భూమేష్, అశోక్‌గౌడ్, నాగరాజు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్లుకూలిన పేదలను ఆదుకోవాలి

**-తహసీల్దార్‌కు వినతిపత్రంసమర్పించిన బిజెపి ఓబిసి రాష్ట్రఉపాధ్యక్షుడు**



తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న పాపగారి రమేశ్‌గౌడ్

**నర్సాపూర్ ఆగస్టు 19, ప్రభాతవార్త:**
వర్షానికి ఇళ్లు కూలిన పేదలను ఆదుకొని వారికి నర్సాపూర్‌లో సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని కోరుతూ బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేశ్‌గౌడ్ అధ్వర్యంలో నర్సాపూర్ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈమేరకు ఇటీవల కురిసిన ఎడతెరిపిలేకుండా కురిసినవర్షాలకు మండలపరిధిలో నర్సాపూర్ మున్సిపాలిటీపరిధిలో శిథిలమైపోయిన ఇళ్లు పూర్తిగా కూలిపోయాయి. దీంతో ఇల్లుకూలిన పేదలు తలదాచుకోవడానికికూడా వీలులేకుండా పోయింది. అంతేగాక ఈవర్షాలకు రోడ్లు ధ్వంసం అయ్యి రాకపోకలకు ప్రజలకు ఎన్నో ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈమేరకు ఇళ్లు కూలిపోయిన వారిని ఆదుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా బిజెపి పార్టీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు బిజెపి నర్సాపూర్ మండల అధ్యక్షుడు నీలి నాగేష్, బిజెపి పట్టణ అధ్యక్షుడు నీరుడు చంద్రయ్య ఆధ్వర్యంలో బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధనయక్షులు పాపగారి రమేశ్‌గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని బిజెపి నాయకులతో కలిసి మండల పరిధిలోని గ్రామాల్లో నర్సాపూర్ మున్సిపాలిటీపరిధిలో పర్యటించారు. కార్యక్రమంలో బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేష్‌గౌడ్, మండల బిజెపి అధ్యక్షుడు నీలి నాగేష్, బిజెపి పట్టణ అధ్యక్షుడు నీరుడు చంద్రయ్యలతోపాటు బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సంగతాని సురేష్, జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గుండం శంకర్, మాజీ కౌన్సిలర్ ఎరుకలి యాదగిరి, మండల ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షులు శ్రీకాంత్‌యాదవ్, టౌన్ సెక్రటరీ సంఘసాని రాజు, జనరల్ సెక్రెటరీ బోర్వెల్ రాంరెడ్డి, ఎస్టీమోర్చా మాజీ మండల అధ్యక్షుడు సంతోష్‌నాయక్, బూత్‌కమిటీ అధ్యక్షులు గణేష్‌ప్రసాద్, శ్రీనివాస్, మహేష్, నరేష్, శ్రీశైలం మహేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మండల సమస్యలపై తహసీల్దార్‌కు వినతిపత్రం



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బిజెపి నాయకులు

**వెల్దుర్తి, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
మండలంలోని రోడ్లు మురికి కాలువలు ఇతర సమస్యల పైన స్థానిక తహసీల్దార్ బాలలక్ష్మికి మంగళవారం బిజెపి మండల అధ్యక్షుడు దాసు ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని సమర్పించారు. రాష్ట్ర బిజెపి పిలుపుమేరకు నర్సాపూర్ నియోజకవర్గంలోని వెల్దుర్తి మండలం సమస్యలను ఆమెకు వివరించారు. ప్రభుత్వాలు సత్వరమే ప్రజలకు అసౌకర్యాలు లేకుండా సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు దాసు, మాజీ మండల అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భారీవర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-ఎంపిడివో సత్తయ్య**



ప్రవహిస్తున్న వాగును పరిశీలిస్తున్న ఎంపిడివో సత్తయ్య

**కొండాపూర్, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
గత వారంరోజులుగా కురుస్తున్న భారీవర్షాల కారణంగా కొండాపూర్ చెరువు అలుగుపారుతుందని గ్రామస్థులద్వారా తెలుసుకొని మంగళవారం ఎంపిడివో ఎం.సత్తయ్య అలుగుపారుతున్న దృశ్యాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారీవర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైతే తప్ప బయటకు రావద్దని అన్నారు. కొండాపూర్, తెర్పోల్ మధ్యగల బ్రిడ్జి పైనుండి నీరు పెద్దమొత్తంలో ప్రవహిస్తుంది కాబట్టి బ్రిడ్జి పైనుండి ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో అటువైపు రాకూడదని హెచ్చరికలు జారీచేశారు. ఆ ప్రవాహంలో చేపలు పట్టడానికి వెళ్ళకూడదని ఇరుగ్రామాల ప్రజలకు హెచ్చరించారు. ఆయనవెంట మండల అధికారులు వున్నారు.

## సహాయ ఉపకరణాలు గుర్తింపు శిబిరం

**-పాల్గొన్న శాసనసభ్యులు పట్లోళ్ల సంజీవరెడ్డి**



దివ్యాంగ విద్యార్థులతో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని భవితాకేంద్రంలో మంగళవారం దివ్యాంగవిద్యార్థులకు సహాయ ఉపకరణాల గుర్తింపు శిబిరంలో పాల్గొన్న నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలోనే మన నారాయణఖేడ్ నియోజకవర్గానికి మోడల్ భవితసెంటర్‌గా తీర్చిదిద్దాలని ఉద్దేశంతో నారాయణఖేడ్ నియోజకవర్గాన్ని ఎంపిక చేసినందుకు జిల్లా కలెక్టర్‌కు, జిల్లా విద్యాధికారులకు నియోజకవర్గ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. దివ్యాంగుల కోసం సదర శిబిరం క్యాంపు కోసం సంగారెడ్డికి వెళ్ళాల్సివస్తుందని, సదరశిబిరాన్ని నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు తదితర మండల ఎంఈఓ, దారం శంకర్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్, పండరి రెడ్డి, మాజీఎంపిటిసి, అశోక్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్, పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్‌ల అందచేత

**సిర్గాపూర్, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కిషన్‌నాయక్ తండాలోని ఎంపిపిఎస్ పాఠశాలలో విద్యను అందుకుంటున్న విద్యార్థులకు పోషకులు చందాలు వేసుకుని విద్యార్థుల పేరుతోగల స్పోర్ట్స్ యూనిఫాంలను మంగళవారం అందచేశారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగారం శ్రీనివాస్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మంజుల దేశ్‌పాండే, రమేష్, సునీత, పండరి, శివకుమార్, సిఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

## కుడవెల్లి వాగుకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

**దుబ్బాక (అక్బర్‌పేటభూంపల్లి), ఆగస్టు 19, ప్రభాతవార్త :** గతంలో రెండు, మూడేళ్లకోసారి కుడవెల్లి వాగు పారేదని, కేసీఆర్ కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సంవత్సరంలో 10 నుంచి 12 సార్లు పారుతుం దని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అక్బర్‌పేటభూం పల్లి మండలం చిట్టాపూర్ అక్బర్‌పేట గ్రామాల మధ్య ప్రవహిస్తున్న కూడవెల్లి వాగును చూసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ గతంలో వర్షాలు వచ్చినప్పుడే వాగు పారేదని, కాని ఇప్పుడు మల్లన్నసాగర్ నిండినప్పుడల్లా కూడవెల్లి వాగు పారుతుందన్నారు. ఇక్కడి నుంచి పోతున్న నీళ్లే అప్పర్ మానేరు, లోయర్ మానేరు, మిడ్ మానేరుకు వెళ్తాయి. జీవనదిలా 365 రోజులు చెక్ డ్యాంల ద్వారా నీళ్లపోతున్నాయంటే అది కాళేశ్వరం గొప్పతనం, కేసీఆర్ గొప్పతనం అని తెలిపారు. కొన్ని లక్షల ఎకరాల పంట ఈ వాగు ద్వారా సాగవుతున్నా యని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శేర్ల కైలాసం, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సోలిపేట సతీష్ రెడ్డి, తీపిరెడ్డి మహేష్ రెడ్డి, చేపూరి శేఖర్ గౌడ్, మాజీ జడ్పిటిసి కడతల రవిందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జీడిపల్లి రవి, నాయకులు పంజాల శ్రీనివాస్ గౌడ్, కొత్త కిషన్ రెడ్డి, దమ్మగౌని ప్రశాంత్‌గౌడ్, మంతూరి సందీప్ గౌడ్, చింత కృష్ణ, పోతనక రాజయ్య, పాపని సురేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రావణమాసం పూజలు



వైశ్య భవన్‌లో పూజలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 19 (ప్రభాతవార్త):** పట్టణంలోని వైశ్య భవన్‌లో మంగళవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రావణమాసం పూజలు వైభ వంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గణపతి పూజ, హోమం, శివ పార్వతుల కళ్యాణం, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, సామూహిక వాసవి పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చే సిన గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి మాట్లా డుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీ మంత్రి హరీష్‌రావుల సహకారంతో నిధులు మంజూరు చేయగా, ఆర్యవైశ్యుల విరాళాలతో వైశ్య భవన్‌ను అద్భుతంగా నిర్మించడం జరిగిం దని తెలిపారు. వైశ్య భవన్‌ను ఆర్యవైశ్యులతో పాటు అన్ని కులాల వారు శుభకార్యాలు నిర్వహించుకోవడానికి అందుబాటులోకి వచ్చిందన్నారు. వైశ్య భవన్ నిర్మాణానికి సహకరించిన గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి ఆర్యవైశ్యులు రుణపడి ఉంటారని తెలిపారు. అనంతరం పూజల్లో పాల్గొన్న వారికి తీర్థ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదం అందజేశారు.

## చెరువులు, కుంటలు నిండటంతో ఆనందంలో రైతులు



జలాల్‌పూర్ చెరువు అలుగు పారుతున్న దృశ్యం

**కొల్చారం, ఆగస్టు19(ప్రభాతవార్త):** మండలంలో ఐదు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఆయా గ్రామాల్లోని చెరువులు కుంటలు అలుగులు పారుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు అలాగే మండల పరిధిలోని నాయిని జలాల్ పూర్ గ్రామం సమీపంలోని చెరువు అలుగు పారడంతో ఆగ్రామ రైతులు సంతోషంగా మొత్తం చేస్తున్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతోనే చెరువులకు గండ్లు

### -మాజీ ఎమ్మెల్యే

**పుల్‌కల్, ఆగస్టు 19, ప్రభాతవార్త:** ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్లే సింగూరు కాలువలు తెగిపోతున్నాయని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆరోపించారు. మంగళవారం మిన్‌పూర్ వద్ద తెగిపోయిన సింగూరు కెనాల్ ను బిఆర్ఎస్ నేతలతో కలిసి మాజీ ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భం గా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువులకు గండిపడుతుండటంతో వరద నీరు పంట పొలాల్లోకి చేరుకుని పంటలను నాశనం చేస్తున్నాయని మండిపడ్డారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై మంత్రి దామోదర్ రాజనర్సింహ నిఘా లేకపోవడంతో అధికారులు తమ ఇష్టారీతిగా విధులు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. అందోల్ నియోజకవర్గంలో ఇరిగేషన్ శాఖ ఉందా అన్న అనుమానాలు వ్యక్తం చేశారు.

## యూరియా పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవు

### -జిల్లా వ్యవసాయాధికారి స్వరూపరాణి



ఎరువుల దుకాణంలో స్టాక్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

**ములుగు, ఆగస్టు 19 (ప్రభాతవార్త):** యూరియా పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వరూపరాణి ఎరువుల దుకాణ యజమానులను హెచ్చరించారు. మంగళవారం ములుగు మండలం లోని వంటిమామిడిలోగల ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఫర్టిలైజర్, ఎరువుల దుకాణదారులు స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలని, ఏ రోజుకు ఆరోజు స్టాక్ రికార్డులను నమోదు చేయాలని సూచించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు, మందులు విక్రయించినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి.ప్రగతి పాల్గొన్నారు.

## కుంగిన వంతెన

**చిన్నశంకరంపేట, ఆగస్ట్ 19, ప్రభాతవార్త:** నాలుగురోజులుగా కురు స్తున్న వర్షాలకు మండలంలోని పలు చెరువులు, వాగులు పొంగిపొర్లుతు న్నాయి. మండలపరిధిలోని రుద్రారం-చందంపేట మార్గమధ్యలోని వంతెన ఒకవైపు కుంగిపోయింది. స్థానికులు కుంగిన ప్రదేశంలో అడ్డుగా చెట్టు కొమ్మను సూచికగా ఏర్పాటు చేశారు. ఈ మార్గంగుండా వెళ్లేవారు జాగ్రత్తగా వెళ్లాలని స్థానికులు తెలిపారు. ఈ వంతెనతో ప్రతి సారి ఇలాగే జరుగు తుందని, వంతెన స్థానంలో కొత్తది నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



రుద్రారం-చందంపేట రహదారిలో కుంగిన వంతెన

# యూరియా సరఫరాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం

### ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

**దుబ్బాక (అక్బర్‌పేటభూంపల్లి), ఆగస్టు 19, ప్రభాతవార్త:** రైతులను అరిగోసపెడుతున్న యూరియా బస్తానే కాంగ్రెస్ ప్రభుత్వంకు ఉరితాడుగా మారుతుందని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. యూరియా సరఫరాలో ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా అక్బర్ పేట భూంపల్లి చౌరస్తాలో ఎమ్మెల్యే, బిఆర్ఎస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి రైతులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి తెలంగాణకు చేసిం దేమి లేదన్నారు. తెలంగాణ నుండి ఢిల్లీకి డబ్బు సంచులు పంపుతున్నారని, ఢిల్లీ నుండి యూరియా సంచులు తెచ్చే సోయిలేదని ఆయన ఏద్దేవా చేశారు. కాంగ్రెస్‌ను నమ్మి ఓట్లేసిగెలిపించింది రైతులు దుఃఖ పడటానికేనా అని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో రాని యూరియా కొరత నేడు ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. రైతులు యూరియ కోసం పోరాటం చేస్తుంటే బిజెపి, కాంగ్రెస్ ఎంపీలు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. వ్యవసాయ మంత్రి ఖమ్మంలో ఉంటాడని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిలాబాద్‌లో ఉంటారని, వారికి మన గోసలు విన పడతాయా అని ఆయన ప్రశ్నించారు. జిల్లా సమస్య లపై వారు ఎప్పుడైనా సమీక్ష చేశారా, ఒక సమస్య పరిష్కరించారా అని ఆయన ఎద్దేవాచేశారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే మంత్రు లను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని ఆయన హెచ్చ రించారు. ఎక్కడన్నా మన ఇల్లు గాని, కారు గాని ఖరాబ్ అయితే మరమ్మతు చేసుకుంటాం కదా, కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక పిల్లర్ కుంగిపోతే ప్రాజెక్టు మొత్తం కృంగిపోయిందని, కూలిపోయింది అని మాట్లాడడం సిగ్గుచేటన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే మేడిగడ్డ వద్ద గల పిల్లర్లు మాత్రమే కావని, ఎన్నో ప్రాజెక్టులు ఎన్నో పంపులు, బ్యారేజ్‌లు, పంపు హౌస్‌లు, సబ్ స్టేషన్లు ఉంటాయని తెలుసు కోవాలన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన కోరారు. వర్షం పడుతున్నా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి రైతులు, బి ఆర్ ఎస్ శ్రేణులతో కలిసి గంట పాటు ఆందోళన కొనసాగించారు.



ప్రధాన రహదారిపై యూరియ కోసం రాస్తారోకో చేస్తున్న ఎమ్మెల్యే ప్రభకర్ రెడ్డి

# ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

**హుస్నాబాద్‌రూరల్/సిద్దిపేట అర్బన్/చిన్నకోడూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త:** ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మంగళవారం హుస్నాబాద్ డివిజన్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా బొలిశెట్టి శివయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అధ్య క్షుడు ముక్కెర రాజుయాదవ్, ప్రధానకార్యదర్శి బైర గోని రాము, ఉపాధ్యక్షులు మక్కెర శ్రీనివాస్, కోశా ధికారి కొడముంజ రాజ్‌కుమార్, ప్రచార కార్య దర్శి పశ్చిమట్ల శ్రీకాంత్, గౌరవ సలహాదారులు తాడూరి సురేష్, ఎలుగూరి మహేష్, కొండి రవీందర్, కళ్లెం లక్ష్మణ్, ముక్కెర రమేష్, యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



లూయాస్ డాగురె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**సిద్దిపేటలో...**

ఫొటోగ్రాఫర్లు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తినిచ్చే విధంగా ఫొటోగ్రాఫర్లు తమ వృత్తిని మరింత అభి వృద్ధి చేసుకోవాలని జిల్లా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దొంతుల శ్రీకాంత్ అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో జిల్లా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ప్రాంగణంలో ఫొటోగ్రఫి పితామహుడు లూయాస్ దాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫొటోగ్రఫీ ఒక కళ మాత్రమే కాకుండా చరిత్రను నిలబెట్టే అద్దమని క్షణాలను శాశ్వతంగా నిలిపే శక్తి ఫొటోలో ఉందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బ్రహ్మచారి, భాస్కర్, గూడూరి శ్రీనివాస్‌రెడ్డి, మిద్దె శ్రీనివాస్, బాసంగారి తేజ సతీష్, వీరబత్తిని శ్రీనివాస్, కారాంపూరి రంజిత్, కొండ్ర ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

**చిన్నకోడూరులో...**

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించు కొని చిన్నకోడూరు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఫొటోగ్రాఫర్లు మొదటి కెమెరా జాస్మిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు. కార్యక్రమంలో సీనియర్ ఫోట ోగ్రాఫర్లు దాసరి చంద్రం, ఎర్రోళ్ల రమేష్, కనకయ్య, స్వామి, శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, రవి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**చిలిపిచెడ్‌లో...**

**చిలిపిచెడ్, ఆగస్టు 19, ప్రభాతవార్త :** చిలిపిచేడ్ మండలం చిట్కుల్ గ్రామంలో మంగళవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహిం చారు. కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురె జయంతి పురస్కరించుకొని ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. లూయిస్ డాగురె చిత్రపటానికి ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు పూలమా లలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డిజిటల్ ప్రపంచంలో ఆదరణ కోల్పోతున్న ఫోటోగ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్య క్రమంలో జోగిపేట స్వామి, పల్లె గణేష్, గజినీ, సునీల్, తదితరులు పాల్గొన్నారు



మొబైల్ ఫోరెన్సిక్ వాహనం ప్రారంభిస్తున్న ఎస్పీ.

## జిల్లాకు మొబైల్ ఫోరెన్సిక్ వాహనం అందజేత

### మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

**మెదక్ టౌన్, ఆగస్టు19, ప్రభాతవార్త:** నేరాలకు సంబంధించిన సంఘటన స్థలంలో నిందితులను గుర్తించడంతో పాటు సాక్షా దారాలను సేకరించే ఫోరెన్సీ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ విభాగం ఈ వాహనాన్ని మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయము లో జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూప్రస్తుతం అందుబాటులో వున్న పరిజ్ఞానాన్ని వినియోగించుకొని. అత్యాధునిక పరికరాల తో రూపొందించబడిన మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని మెదక్ జిల్లా పోలీసులకు మరింత మెరుగైన సేవలందించనుందన్నారు. ఇకపై ఏదైనా నేరం జరిగిన ప్రదేశానికి ఫోరెన్సిక్, ఫింగర్ ప్రింట్ అధికారులు, సిబ్బందిఈ మొబైల్ ఫోరెన్సిక్ వాహనంలో చేరుకోని సంఘటన జరిగిన స్థలం నుండి రక్త మరకలు, వ్రేలి ముద్రలతో పాటు మరో 14 రకాల ఇతర సాక్ష్యాధారాలను సేకరించి ఈ మొబైల్ వాహనంలో ఏర్పాటు చేసిన అధునిక పరికరాలతో పరీక్షలను నిర్వహించి సంబంధిత దర్యాప్తు అధికారికి ప్రాథమిక సాక్ష్యాధారాలను అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యాక్రమం లో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, ఏఆర్ డియస్పి శ్రీ రంగా నాథ్, ఇన్స్పెక్టర్ మధు సుధన్ గౌడ్, ఆర్ఐ లు శ్రీరామ కృష్ణ, శైలందర్ ఫింగర్ ప్రింట్ ఏఎస్ఐ మహేష్ సిబ్బంది పాల్గొన్నారు.



నర్సాపూర్ రాయరావు చెరువును పరిశీలిస్తున్న డి.ఎస్.పి నరేందర్‌గౌడ్, సిఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ.లింగం

## నర్సాపూర్ రాయరావు చెరువును పరిశీలించిన డిఎస్‌పి నరేందర్‌గౌడ్

**నర్సాపూర్ ఆగస్టు 19, ప్రభాతవార్త:**

నర్సాపూర్ పట్టణంలోని రాయరావు చెరువును మంగళవారం తూప్రాన్ డి.ఎస్.పి నరేందర్ గౌడ్ సందర్శించి పరిశీలించారు. చెరువు వద్దకు వెళ్లి చెరువు పరిసరాలను సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బారీ వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నందున ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువు కుంటలు, వాగులు వంకలు పొంగి పొర్లీ పారుతున్నందున ప్రజలు అక్కడికి వెళ్లవద్దని సూచించారు. వాగులు వంలు ,మత్తడ్లు పొంగిపొర్లుతున్నందున వాటి వద్దకు వెళ్లి దాటే ప్రయత్నాలు చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు.

అంతేగాక రానున్న వినాయక చవితి పండగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఎటువంటి అల్లర్లు, అలజడులు, గొడవలు జరుగకుండా ఉండాలన్నారు. అంతేగాక మండపాల వద్ద జాగ్రత్తగా ఉండి ఉత్సాహంగా పండగను జరుపుకోవాలని సూచించారు. ఈ సమయంలోతూప్రాన్ డి.ఎస్.పి నరేందర్ గౌడ్ వెంట నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి, ఎస్సైబి.లింగం పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

# కొత్త ప్రభాకర్‌ది పులికేక కాదు పిల్లికేక

### కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

**దుబ్బాక, ఆగస్టు 19, ప్రభాతవార్త :** లక్ష కోట్లతో కట్టిన ప్రాజెక్టు మూడుసంవత్సరాల్లో కూలిపోవడం బిఆర్ఎస్ అవినీతికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యూరియా కోసం క్యూలో నిలబడిన అచ్చుమాయిపల్లి రైతు ఎల్లయ్య మృతి చెందగా, అప్పటి ఎంపి కొత్త ప్రభాకర్ పరామర్శించలేదని శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. అలాంటి వ్యక్తి ఈరోజు రైతుల కోసం ధర్నా చేయడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది అని ఎద్దేవా చేశారు. కొత్త ప్రభాకర్ పులికేక కాదు పిల్లికేక అని ఘాటు వ్యాఖ్య చేశారు. రష్యా-ఉక్రెయిన్, ఇరాన్ యుద్ధాల వల్ల యూరియా కొరత ఏర్పడిందని, అయినప్పటికీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చెబుతూ బిజెపి పాలిత రాష్ట్రాలకు మాత్రమే యూరియాను పంపి తెలంగాణ రైతులపై అన్యాయం చేసిందని తెలి పారు. కేంద్రం ప్రభుత్వం నానో యూరియాను వాడమని చెప్పి కేంద్రం యూరియా కోటాను తగ్గిం చిన విషయం తెలిసీ కొత్త ప్రభాకర్ కాంగ్రెస్ ప్రభు త్వంపై ఆరోపించడం ఆయన అజ్ఞానానికి నిదర్శన మని అన్నారు. లక్ష కోట్లతో కట్టిన ప్రాజెక్టు మూడు సంవత్సరాల్లో కూలిపోవడం బిఆర్ఎస్ అవినీతి ఫలితం అన్నారు. ఇంటికి పొక్క పడిందని ఇల్లును కూల్చుకుంటామా? అని కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడ డం వారి అజ్ఞానానికి నిదర్శనమని తెలిపారు. పైన వర్షాలు పడి కూడవెల్లి వాగులో నీళ్లు పారితే అది కాళేశ్వరం ఘనత అని చెప్పడం బిఆర్ఎస్, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎంత దిగజారి రాజకీయాలు చేస్తుండో దుబ్బాక నియోజకవర్గం ప్రజలు అర్థం చేసుకోవాలని తెలిపారు.



మాట్లాడుతున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

**దుబ్బాక వాగు చెక్‌డ్యామ్‌లు ముత్యం రెడ్డి కృషి...**

రామగుండం ఎరువుల కర్మాగారానికి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ 10 వేల కోట్ల రుణమాఫీ చేసి ఉత్పత్తిని పునరుద్ధరించారు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి 20 నెలల్లో 45 సార్లు ఢిల్లీ వెళ్లి రాష్ట్ర సమ స్యలు, రైతుల యూరియా కోసం కోరారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం 2 లక్షల రుణమాఫీ చేసిందని గుర్తు చేశారు. సంవత్సరానికి 12వేల రైతు భరోసా ఇస్తుందన్నారు. ప్రతి క్వింటాల్‌కు 500 బోనస్ ఇస్తుందని, పేదలకు ఉచిత సన్నబియ్యం పంపిణీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. రైతుల యూరియా కోసం కేంద్రంతో పోరాడి సాధించేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ఈ సందర్భంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## విద్యార్థులు బాగా చదివి శాస్త్రవేత్తలు కావాలి : ఎమ్మెల్యే

**నారాయణఖేడ్, ఆగస్టు19 ప్రభాతవార్త :** విద్యార్థులు బాగా చదివి గొప్ప శాస్త్రవేత్తలు కావాలని నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి, సబ్ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన మొబైల్ సైన్స్ ల్యాబ్ ప్రారంభోత్సవ కార్య క్రమంలో వారు పాల్గొన్నారు. సంచార విజ్ఞాన ప్రయోగశాల ప్రారంభించ బడి మొట్టమొదటి పాఠశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలని, నారాయణ ఖేడ్ విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథం పెంపొందించడం కోసం, ప్రతి మారుమూల ప్రాంతంలో ఉన్న విద్యార్థులకు కూడా శాస్త్ర సాంకేతికతపై అవగాహన కల్పించడం విద్యార్థులచే హ్యాండ్ ఆన్ ఎక్స్పీరియన్స్ ఏదైనా విషయాన్ని చూస్తూ, చేయడం ద్వారా నేర్చుకోవడం అయితే విద్యార్థులు ఎప్పటికీ మర్చిపోలేరు, లెర్నింగ్ అంత ఎఫెక్టివ్ గా ఉంటుందన్నారు. అలాగే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం అలవడుతుందని, కళ్ళ ముందు జరిగే ప్రతీ చర్య, పని కీ సైంటిఫిక్ రీసన్ ఉంటుందనే అంచనా కి విద్యార్థులు రావడం, విద్యార్థి ఇట్టి విషయంలో ప్రత్యక్ష అనుభవం కలిగేలా చేయడం తదితర ఉద్దేశాలతో విద్యార్థుల చెంతకే నడిచే ప్రయోగశాల, ఈ సంచార విజ్ఞాన ప్రయోగశాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, సీఈఓ వెంకటేష్, జిల్లా సైన్స్ అధికారి పి.సిద్దారెడ్డి, మండల విద్యాధికారులు మన్మధకిషోర్, విశ్వనాథ్, నారాయణఖేడ్ మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, పండరీ రెడ్డి ,రిసోర్స్ పర్సన్ కొత్త మురళి, వెంకటేశం వినయ్ కుమార్, మల్లికార్జున్, అక్బర్, చంద్రశేఖర్, రాజయ్య, రవి కుమార్, సాయిచరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

## వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తహసీల్దార్

**దుబ్బాక(అక్బర్‌పేటభూంపల్లి), ఆగస్టు 19, ప్రభాతవార్త:** అధికంగా కురు స్తున్న వర్షాలపట్ల అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి ప్రజలను కోరారు. భారీ వర్షాల కారణంగా అక్బరుపేట భూంపల్లి మండలం లోని రామేశ్వరంపల్లి గ్రామం బ్రిడ్జి వద్ద కూడవెల్లి వాగు మంగళవారం పొంగిపొర్లుతోంది. ఈ సందర్బంగా ఆయన వాగును మంగళవారం పరిశీ లించారు. వాగుల వద్దకు ఎవరూ రావద్దని, అత్యవసరమైతే తప్ప బయ టకు రాకూడదని సూచించారు. విద్యుత్ స్థంబాలు, ఎలక్ట్రిక్ వస్తువుల నుంచి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. అత్యవసరమైన పరిస్థితులు ఏర్పడితే తహశీల్దార్ కార్యాలయం 7396621 231 ఫోన్ నెంబర్ కు సంప్రదించి తగిన సహకారం పొందాలని కోరారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన శ్రీనివాస్‌రెడ్డి

**దుబ్బాక(అక్బర్‌పేటభూంపల్లి), ఆగస్టు 18, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కూతురి చందు మృతి పట్ల ఆ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. చందు భౌతిక కాయానికి కాంగ్రెస్ జెండా కప్పి పూలమాలవేసి నివాళులర్పించి, ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన ప్రార్థించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ దుకాణాలను తహసీల్దార్ తనిఖీ

**దుబ్బాక(అక్బర్‌పేటభూంపల్లి), ఆగస్టు 19, ప్రభాతవార్త :** మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను తహసీల్దార్ సంజీవ్‌కుమార్, వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్ కలసి తనిఖీ నిర్వహించారు. అలాగే అక్బర్‌పేట భూంపల్లి మండలపరిధిలోని ఆగ్రోస్, మన గ్రోమోర్ ఫర్టిలైజర్ షాపులను తహశీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి వ్యవసాయాదికారి బత్తిని సత్యన్వేష్ కలసి తనఖీ చేయటం జరిగింది. ఇంతవరకు వచ్చిన యూరియా, ఇతర ఎరువుల రికార్డులను, రైతులకు ఇచ్చిన రిజిస్టర్‌ను తనిఖీ చేయటం జరిగింది. ఈపాస్ మెషిన్, ఓటీపీ ద్వారా రైతులకు యూరియా అందిస్తున్నట్లు తెలపటం జరిగింది. రైతులకు దశల వారీగా ఎరువులు అందిస్తామని, ఆందోళన చెందకూడదని చెప్పారు. నానో యూరియాను ప్రత్యామ్నాయంగా వాడుకోవాలని సూచిం చారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, షాపుల యజమానులు ఉన్నారు.

## వర్షానికి కూలిన ఇళ్లను పరిశీలించిన అధికారులు

**కొల్చారం, ఆగస్టు 19(ప్రభాతవార్త):** ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో ఆయా గ్రామాలలో ఇండ్లు కూలిపోయాయి. మంగళ వారం రాంపూర్, పైతర గ్రామాలలో కూలిపోయిన ఇండ్లను కొల్చారం తాసిల్దార్ శ్రీనివాస్ చారి, ఎంపీడీవో ఫరూక్ ఉన్నిసా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా 43 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని అన్నారు. బాధితులకు నష్ట పరిహారం చెల్లించుటకు కృషి చేస్తామని అధికారులు హామి ఇచ్చారు.

## ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

**చిన్నశంకరంపేట, ఆగస్ట్ 19, ప్రభాతవార్త:** మూడు నెలలుగా ప్రభుత్వం వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తుందని మండల ఆశా వర్కర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం చిన్నశంకరంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంతో కీలక పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్లకు వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి జీతాలను విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. వైద్యాధికారి సాయి సింధూకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఛాయాచిత్ర దినోత్సవం

**చిన్నశంకరంపేట, ఆగస్ట్ 19, ప్రభాతవార్త:** ప్రపంచ ఛాయాచిత్ర దినో త్సవాన్ని పురస్కరించుకొని చిన్నశంకరంపేటలో ఫోట, విడియోగ్రాఫర్‌ల సంఘం మండలాధ్యక్షుడు నిద్రబోయిన స్వామి ఆధ్వర్యంలో డా, లూయిస్ జాక్వెస్ మండే డ్యాగూరే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, శేఖర్, నర్సింలు, ప్రభుత్వ, షాదుల్లా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఫొటోగ్రాఫర్ల దినోత్సవం

**ఝరాసంగం, ఆగస్టు 19, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో మంగళ వారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఫోటోగ్రాఫర్లు ఘనంగా జరుపుకు న్నారు. ఈ సందర్భంగా లూయిస్ డాటూప్ర చిత్ర పటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఫోటో గ్రాఫర్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు వీరన్న పాటిల్, మండల అధ్యక్షులు దినకర్, కార్యదర్శి కృష్ణ, కోశాధికారి ప్రకాష్, సంఘం సభ్యులు సిహెచ్ నర్సింలు, దర్శన్, శ్రీనివాస్, సైదులు, సద్దాం హుస్సేన్, ఓంకార్, శ్రీకాంత్, జనార్ధన్, విష్ణువర్ధన్, సందీప్, వంశీ, నర్సింలు, నాగేష్, ఈశ్వర్, సంతోష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



లూయిస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

## మనస్థాపంతో యువకుడి ఆత్మహత్య

**ఝరాసంగం, ఆగస్టు 19, ప్రభాతవార్త:** మనస్థాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం కుప్పానగర్ గ్రామ సరిహద్దు లో చోటు చేసుకుంది. ఎస్ఐ పాటిల్ క్రాంతి కుమార్ కథనం ప్రకారం... కర్ణాటకలోని బీదర్ జిల్లా హుమ్నాబాద్ తాలుకా కన్కట్ట గ్రామానికి చెందిన మాధవగిరి (34) ఇన్నాపూర్‌లోని ఎంఎస్ఎస్ కర్మాగారంలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ జీవనాన్ని సాగిస్తున్నాడన్నారు. గత 5 సంవత్సరాల క్రితం బసవకళ్యాణ్‌లో 5 లక్షల రూపాయల రుణాన్ని తిరిగి చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతూ బుధవారం నాడు ఇంటి నుంచి వెళ్లిపోయి ఝరాసంగం గ్రామ శివారులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడి భార్య దండుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుఎస్సై పాటిల్ క్రాంతి కుమార్ వివరించారు.

## సిపిఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎ రెహమాన్

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
మేడ్చల్ జిల్లా గాజుల రామారాములో ఈ నెల 20 నుండి మూడు రోజుల పాటు జరగే సిపిఐ రాష్ట్ర నాలుగో మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎంఎ రెహమాన్ కోరారు. సంగారెడ్డి జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభల్లో జాతీయ అంతర్జాతీయ పరిణామాలపై చర్చ ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో మహబూబ్‌ఖాన్, ఎంఎ ఖాజా, లక్ష్మి ్మ, అనురాధ, శివశంకర్, శివలీల తదితరులు పాల్గొన్నారు.

## రేపు మునిపల్లి మండలంలో మంత్రి పర్యటన

**-పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**



మార్కెట్‌కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, మండలకాంగ్రెస్ అధ్యక్షుడు సతీష్

**మునిపల్లి, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
మునిపల్లి మండలంలోని పలు అభివృద్ధి పనులను ప్రారంభించుటకు గురువారం రాష్ట్ర ఆరోగ్యశాఖామాత్యులు దామోదర రాజనర్సింహ రానున్నట్టు మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూర్ సుధాకర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగన్నగారి సతీష్‌కుమార్ తెలిపారు. ఉదయం బుధేరాలోని మహిళా డిగ్రీ కళాశాలలో పలు అభివృద్ధిపనులను ప్రారంభిస్తారన్నారు. అనంతరం ఖమ్మంపల్లి బిటి రోడ్డుకు శంకుస్థాపన, మునిపల్లి మోడల్ స్కూల్‌లో వివిధ కార్యక్రమాలలో పాల్గొని, మునిపల్లి-చందాపూర్ రోడ్డుపనులకు శంకుస్థాన చేసిన తర్వాత అల్లాపూర్-తక్కెడపల్లి రోడ్డుకు భూమిపూజ నిర్వహిస్తారన్నారు. అనంతరం తాటిపల్లి కస్తూర్బా పాఠశాలలో వివిధ పనులకు భూమిపూజ చేసిన తర్వాత తాటిపల్లి నుండి మక్తక్యాసారం రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. అనంతరం గార్లపల్లి-తక్కెడపల్లి బ్రిడ్జిపనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. మండలంలోని కాంగ్రెస్‌పార్టీ నాయకులు, గ్రామశాఖ అధ్యక్షులు, మాజీ ఎంపిటిసి సభ్యులు, మాజీ సర్పంచులు, యువజన కాంగ్రెస్ నాయకులు రైతులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

## సిపిఎస్ రద్దుకై మహాధర్నా గోడపత్రిక ఆవిష్కరణ



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న పిఆర్‌టియు నాయకులు

**వట్‌పల్లి, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
పిఆర్‌టియూ టిఎస్ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన సిపిఎస్ రద్దు కోసం మహాధర్నా కార్యక్రమ గోడపత్రికను వట్‌పల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ టిఎస్ ప్రధానకార్యదర్శి నర్సింలు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సిద్దేశ్వర్, రాష్ట్ర కార్యదర్శి స్టీవెన్సన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మురళీధర్, జిల్లా బాధ్యులు సుధాకర్, ఉపాధ్యాయులు సుధాకర్, విట్ఠల్, సాయికృష్ణ, యాదగిరి, శ్రీరాం, రాములు, సంగమేశ్వర్, సౌజన్య మెహరాజ్ పాల్గొన్నారు.

## చౌటకూరులో వయోజన విద్యా ఉల్లాస్




ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ అనురాధ

**చౌటకూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన చౌటకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన వయోజన విద్య ఉల్లాస్ శిక్షణ కార్యక్రమాన్ని మండల విద్యాధికారిణి అనురాధ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ అనురాధ మాట్లాడుతూ వయోజన విద్యపై ప్రాముఖ్యతను వివరించారు. విద్య ప్రతి ఒక్కరికీ అవసరమని, అక్షరాస్యత ద్వారా సామాజిక మార్పులు సాధ్యమవుతాయన్నారు. ప్రతి గ్రామంలో విఓఏలు, ఉపాధ్యాయులు చైతన్య కార్యక్రమాలు నిర్వహించి అక్షరాస్యతను పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు అనురాధ, ఎంపిడిఓ శంకర్, కాంప్లెక్స్ సెక్రటరీ సుభాష్‌బాబు, ఉపాధ్యాయులు శ్రీకాంత్, వయోజన సంఘాల ప్రతినిధులు శోభ, గౌని కిరణ్, మాల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

## నల్లవాగు పరిసరాల్లో జాగ్రత్తలు అవసరం

**సిర్గాపూర్, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
నల్లవాగు పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఎస్ఐ మహేష్ సూచించారు. మంగళవారం నల్లవాగు ప్రాజెక్టును ఎస్ఐ సందర్శించి వాగు వద్ద హెచ్చరిక బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. ప్రజలు నల్లవాగు వద్దకు వెళ్లకూడదని హెచ్చరించారు. అలుగు వద్దకు, చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదాలకు గురికావద్దని మండల ప్రజలకు సూచించారు.

## అనారోగ్యంతో యవకుడి మృతి

**చిన్నశంకరంపేట, ఆగస్టు 18, ప్రభాతవార్త:**
అనారోగ్యంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధి ఎస్ కొండాపూర్ పంచాయతీ ప్యాటగడ్డలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ప్యాటగడ్డ గ్రామానికి చెందిన స్వామి(20) చిన్నప్పటి నుండి ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. రెండురోజుల క్రితం జ్వరం,ఫిట్స్ రావడంతో కుటుంబసభ్యులు మెదక్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అక్కడి డాక్టర్లు ఇతరపరీక్షలు నిర్వహించగా గుండె వేగంగా కొట్టుకోవడంలేదని, మెరుగైనవైద్యంకోసం భాగ్యనగరానికి తరలించాలని వైద్యులు సూచించారు. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమద్యలో స్వామి మృతి చెందాడు. కాగా స్వామి డెంగ్యూ లక్షణాలతో మృతి చెందాడని ప్రచారం కాగా మండల వైద్య అధికారి సాయిసింధూ ఖండించారు. స్వామి ఫిట్స్ రావడంతో మృతిచెందాడని, డెంగ్యూ లక్షణాలు లేవని, వదంతులు నమ్మవద్దని తెలిపారు.

# ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం

**-జీవితంలో మధుర జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చేదే ఫోటోగ్రఫీ**
**-జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య**




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డిమున్సిపాలిటీ, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
మన జీవితంలోని మధుర జ్ఞాపకాలను ఎప్పటికీ భద్రపరిచేది ఫోటోగ్రఫీ మాత్రమేనని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. మంగళవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సంగారెడ్డి కలెక్టరేట్లో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి టిజిఐఐసి చైర్మన్ నిర్మలజగ్గారెడ్డి, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జ్యోతిప్రజ్వలన చేసి ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ గతంతో పోల్చితే ఫోటోగ్రఫీలో అనేక మార్పులు వచ్చాయన్నారు. కొత్త టెక్నాలజీ, ఫ్యాషన్ ప్రతిబింబం, జీవితకాల జ్ఞాపకాల అద్దం ఫోటోగ్రఫీ అన్నారు. ఒకఫోటో అనేది కేవలం చిత్రంమాత్రమే కాదు, అది సమాజంలోని అనేకకోణాలను మన ముందుంచుతుందని అన్నారు. ఒకఫ్రేమ్‌లో భావాలను వ్యక్తపరచగల శక్తి ఫోటోగ్రఫీకే ఉంది. సమాజంలో జరుగుతున్న సంఘటనలకు ఫోటో ఒక సజీవసాక్ష్యం. కొత్త టెక్నాలజీ సహకారంతో ఈకళ మరింత విస్తరించింది. ప్రతిచిత్రంలో ఒక ఫ్యాషన్, ఒకసృజనాత్మకత ప్రతిఫలిస్తుందని తెలిపారు. అదే విధంగా, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఫోటోగ్రఫీ వర్క్‌షాప్‌లునిర్వహించి, వారికి ఫోటోగ్రఫీలో మెలకువలునేర్పి శాస్త్రీయదృక్పథం పెంపొందించే ప్రయత్నాలుచేయాలని సూచించారు. ఈసందర్భంగా టిజిఐఐసి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఫోటోగ్రఫీ జర్నలిజం ద్వారా ప్రజల్లో చైతన్యం పెరుగుతోంది. ఒకఫోటో మనసులను కదిలించే శక్తిని కలిగి ఉంటుందని విపత్తుల సమయంలో బాధితుల పరిస్థితిని ప్రతిబింబించే చిత్రాలు ప్రజలలో స్పందన కలిగించి సహాయం అందించేందుకు ప్రేరేపిస్తాయని, ఫోటోగ్రఫీ కేవలం కళ మాత్రమే కాదు, అది సమాజానికి అద్దం. ప్రతి జ్ఞాపకాన్ని శాశ్వతం చేసే శక్తి ఫోటోకే ఉంది అని పేర్కొన్నారు. సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదసమయంలో కార్మికులకు సహాయకచర్యలు అందించడంలో జిల్లాకలెక్టర్ ప్రావీణ్య ప్రత్యక్షంగా ఒకకార్మికురాలిగా పనిచేసి వారికి అండగా నిలిచారని టిజిఐఐసి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి ఈసందర్భముగా గుర్తుచేశారు. జిల్లా ఎస్పీ పరితోష్‌పంకజ్ మాట్లాడుతూ ఫోటోగ్రఫీ అనేది ఒక విలువైన సామాజిక సాధనం. ఇది సమాజాన్ని కదిలించే శక్తిని కలిగి ఉంది. ప్రతి సంఘటనను చరిత్రలో నిలబెట్టే మహత్తరమైన పాత్ర పోషిస్తుందని, కొత్త టెక్నాలజీ, ఫ్యాషన్ మిళితంగా ఒకఫోటో జీవితంలో ఎన్నో జ్ఞాపకాలను తిరిగి గుర్తుచేసే శక్తిని కలిగి ఉందని అన్నారు. అంతకుముందు జిల్లా ఫోటోగ్రఫీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను వీరు సందర్శించి, అక్కడ ప్రదర్శించిన చిత్రాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్(స్థానికసంస్థలు) చంద్రశేఖర్, టిజిఓ జిల్లా అధ్యక్షులు వైద్యనాథ్, టియుడబ్లుజె రాష్ట్ర ఉపాధ్యక్షులు ఫైజల్, టియుడబ్లుజె జిల్లాఅధ్యక్షులు యాదగిరి, టిఎన్జీవో జిల్లా అధ్యక్షులు ఎండి జావిద్ అలీ, జిల్లా ఫోటోగ్రఫీ అసోసియేషన్ అధ్యక్షులు అరీఫ్, జనరల్ సెక్రటరీ సత్యం, వివిధ జర్నలిస్ట్‌సంఘాల ప్రతినిధులు, పాత్రికేయులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తెగిన మెయిన్ కెనాల్‌కు మరమ్మతులు చేపట్టండి

**-అధికారులతో సిపిఎం డివిజన్ కన్వీనర్ విద్యాసాగర్**



అధికారికి వినతిపత్రం అందచేస్తున్న సిపిఎం కన్వీనర్ విద్యాసాగర్

**పుల్‌కల్, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ఇసోజిపేట, మిన్పూర్, బస్వాపూర్ గ్రామాల శివారులోని మెయిన్ కెనాల పగిలిపోవడంతో వందల ఎకరాల్లో పంట నష్టపోయే పరిస్థితి దాపురిస్తోందని, తక్షణమే కాలువకు మరమ్మతు పనులు చేపట్టాలని సిపిఎం అందోల్ డివిజన్ కన్వీనర్ డి.విద్యాసాగర్ డిమాండ్ చేశారు. మంగళారం అధికారికి వినతిపత్రం అందచేసిన సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ కురుస్తున్న భారీ వర్షాలతో ఆయా గ్రామాల్లోని మెయిన్‌కాలువ పగిలి తీవ్రమైన పంట నష్టం జరుగుతుందన్నారు. గతంలో సైతం ఇదే పరిస్థితిని ప్రజలు ఎదుర్కొన్నారని, సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు వినతి చేసినా ప్రయోజనంలేకుండా పోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇసోజిపేటలో 5మార్లు కెనాల్ పగిలిపోయిందని, మిన్పూర్ దగ్గర 100 ఎకరాల్లో పంట నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని, వెంటనే నష్టపోయిన పంటకు పరిహారం అందించడంతోపాటు కెనాల్‌కు మరమ్మతు పనులు చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

## రేజింతల్‌లో మామిడి చెరువును పరిశీలించిన అధికారులు



రేజింతల్‌లో పారుతున్న చెరువును పరిశీలిస్తున్న అధికారులు

**న్యాల్‌కల్, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని రేజింతల్-ఝరాసంగం రోడ్డులో ప్రమాదకరంగా ప్రవహిస్తున్న మామిడి చెరువును మంగళవారం అధికారులు పరిశీలించారు. చెరువు వద్దకు తహసీల్దార్ ప్రభులు, ఎంపిడిఓ శ్రీనివాస్, ఎస్ఐ దోమ సుజిత్‌లు పంచాయతీ కార్యదర్శితో కలిసి చెరువును పరిశీలించారు. చెరువు గుండా ప్రవహిస్తున్న వరద నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నందున రౌండ్ ద క్లాక్‌గా పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని, అందుకు విఆర్ఏ, పంచాయితీ సిబ్బందని నియమించి జాగ్రత్తలు అప్పచెప్పారు. ఇదిలా ఉండగా మండల పరిధిలోని ఇబ్రహింపూర్‌లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఎంపిడిఓ శ్రీనివాస్ పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు ఎంపిడివో శ్రీనివాస్ సూచించారు.

## కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించండి

**-కార్పొరేటర్ పుష్పతో కాలనీ అసోసియేషన్ సభ్యులు**



కార్పొరేటర్ పుష్పనగేష్‌కు సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు

**రామచంద్రాపురం, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీసాయినగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు మంగళవారం కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్పనగేస్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని కాలనీలో నెలకొన్న సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకుపోయారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ కాలనీలో నూతన ఆలయం, సొసైటీ కార్యాలయం, థీమ్ పార్క్‌లో వాచ్‌మెన్ రూం, బోరువెల్, తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, నిధులు మంజూరు చేయించి సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్ దృష్టికి తీసుకుపోగా కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ కాలనీ అసోసియేషన్ సభ్యులకు హామీ చేశారు.

## కాంట్రాక్ట్ కార్మికులకు కనీసవేతనం రూ.26వేలకు పెంచాలి

**-కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మానిక్**



సిబిఎల్‌లో సర్వేనిర్వహిస్తున్న కాంట్రాక్ట్ వర్కర్స్ జిల్లా అధ్యక్షులు మానిక్

**చౌటకూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
షెడ్యూల్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల కనీస వేతనాలను 26వేల రూపాయలకు పెంచుతూ జిఓలను సవరించాలని కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అతిమేల మానిక్ అన్నారు. మంగళవారం కాంట్రాక్ట్ కార్మికుల క్యాంపెయిన్‌లో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో మండలంలోని శివంపేటలోని సిబిఎల్ పరిశ్రమలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా అతిమేల మానిక్ మాట్లాడుతూ కార్మికుల హక్కులను, సౌకర్యాలను తొలగిస్తూ ప్రధాన మంత్రి మోది లేబర్ కోడ్‌లతో కార్మికులను కట్టు బానిసలుగా మార్చేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని 1700 పరిశ్రమల్లో లక్షలాది మంది కార్మికులకు పని చేస్తున్నారని, అనేక పరిశ్రమల్లో చట్టబద్ధమైన సౌకర్యాలు, హక్కులు సరాగ్గా అమలు కావడంలేదని మండిపడ్డారు. కార్మికులకు కనీసవేతనాలు పెంచకుంటే ఉద్యమాలు తప్పవని ప్రభుత్వాలకు హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రసన్న, జిల్లా కార్యదర్శి సురేష్, విఠల్, మల్లారెడ్డి, నాగభూషణం, మహేష్, శ్రీనివాస్, మైపాల్, లక్ష్మణ్, రమేష్, విష్ణువర్ధన్, నరేష్, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

# మహాధర్నాలో ఉపాధ్యాయులందరూ పాల్గొనాలి




మహాధర్నా పోస్టర్‌ను విడుదల చేస్తున్న పిఆర్టీయు నాయకులు

**మునిపల్లి, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
సిపిఎస్‌విధానాన్ని పూర్తిగారద్దుచేయాలనికోరుతూ సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద పిఆర్‌టియు ఉపాధ్యాయ సంఘం తలపెట్టిన మహాధర్నా కార్యక్రమంలో మునిపల్లి మండలంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ పాల్గొని విజయవంతం చేయాలని మండల అధ్యక్షులు చంద్రమౌళి, ప్రధానకార్యదర్శులు పిలుపునిచ్చారు. మంగళవారం మునిపల్లి పాఠశాలలో మహాధర్నా గోడపత్రికను వివిధపాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పిఆర్‌టియు మండల నాయకులు, ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల భద్రతని కాలరాస్తున్న సిపిఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలని కోరారు. ఈవిధానంవల్ల గత ఇరవైసంవత్సరాలుగా అనేకమంది ఉపాధ్యాయుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ముప్పైసంవత్సరాలపాటు ప్రభుత్వానికి సేవలందించి ఉద్యోగులకి పెన్షన్ సౌకర్యం తీసివేసి సిపిఎస్ విధానాన్ని అమలుపరచడం చాలా బాధాకరం అన్నారు. ప్రస్తుతం రిటైర్‌అవుతున్న సిపిఎస్ ఉద్యోగులకు వృద్ధాప్య పింఛను కంటే తక్కువ పెన్షన్ వస్తుందని ఉద్యోగుల కష్టార్జితాన్ని షేర్ మార్కెట్ పాలుజేసి, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకి పెన్షన్ వసతి తీసేయడాన్ని ఖండిస్తూ, ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ వెంటనే పాతపెన్షన్‌విధానాన్ని అమలుపరచాలని కోరుతూ హైదరాబాద్‌లో సెప్టెంబర్ 1న పిఆర్‌టియు ఉపాధ్యాయసంఘం ఆధ్వర్యంలో శాంతియుతంగా జరిగే మహాధర్నాలో ఉద్యోగ ఉపాధ్యాయులందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, వీరయ్య, అశోక్, తుల్జయ్య, చంద్రశేఖర్, యాదయ్య, కరుణాకర్ రెడ్డి, రవి, ప్రకాశం, మనోహర్‌రెడ్డి శైలజ, శరణమ్మ, ఉమారాణి, సౌజన్య అనిల్, సిద్దేశ్వర్, వీరన్న, కిష్టయ్య, శ్రీకాంత్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పేటలో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని జరుపుకుంటున్న ఫోటోగ్రాఫర్లు

**సదాశివపేట, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
186వ ప్రపంచఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను సదాశివపేటలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు బిట్ల రాజు మాట్లాడుతూ ఫోటో, వీడియోగ్రాఫర్స్ అందరూ ఐక్యతతో ఉండి ఆర్థిక అభివృద్ధి చెందాలన్నారు. ఫోటోగ్రఫీ రంగంలో నూతన టెక్నాలజీ ప్రకారం కెమెరాలను ఉపయోగిస్తూ ఈవెంట్లు చేయాలన్నారు. ఫోటోగ్రాఫర్ల సంక్షేమం కోసం రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో కుటుంబ భరోసా పథకం ప్రవేశ పెట్టడం సంతోషకరమని అట్టి సంక్షేమ పథకంలో ప్రతి ఒక్క ఫోటోగ్రాఫర్లు సభ్యునిగా చేరి ప్రతి ఫోటోగ్రాఫర్ కుటుంబానికి భరోసాగా ఉండాలన్నారు. ప్రతి ఫోటో, వీడియోగ్రాఫర్ కుటుంబానికి భరోసా పథకం తప్పనిసరి. రానున్న రోజుల్లో రాష్ట్ర సంఘం మరెన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరుగుతుందని వాటిని అర్హులైన ఫోటోగ్రాఫర్లందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో కరుణాకర్, కాషా సంగమేశ్వర్, రుమాండ్ల రాజు, గొల్లపల్లి శ్రీనివాస్, రాఘవేందర్, శరత్, వీరేశం, అశోక్, మల్లేశం, విజయ్‌కుమార్, నరేష్, నాగారం రాము, తదితర ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ పాల్గొన్నారు.

## సిర్గాపూర్‌లో ఘనంగా ఫోటోగ్రఫీ దినోత్సవం

**సిర్గాపూర్, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో మంగళవారం ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఫోటోగ్రఫీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ఎస్ఐ మహేష్ ముఖ్య అతిథిగా హాజరై ఫోటోగ్రాఫర్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఫోటో, వీడియోగ్రాఫర్‌లు కిరణ్‌రావు, నర్సాగౌడ్, సాయిలు, రాజాగౌడ్, మహేందర్‌గౌడ్, అంబదాస్, చిన్న, బల్బీమ్, విఠల్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గోదావరిని సన్మానించిన అరుణ్‌రాజ్



గోదావరిని మర్యాదపూర్వకంగా కలుసుకున్న అరుణ్‌రాజ్ శేరికార్

**సిర్గాపూర్, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షురాలు చిన్నమైల్ గోదావరి అంజిరెడ్డిని మంగళవారం పార్టీ జిల్లా కార్యదర్శి అరుణ్‌రాజ్ శేరికార్ మర్యాద పూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించారు. అరుణ్‌రాజ్ శేరికార్‌కు పార్టీ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతగా శేరికార్ గోదావరిని కలుసుకుని కృతజ్ఞతలు తెలుపుతూ పార్టీ అభ్యున్నతకి తన వంతు సహకారం అందిస్తామన్నారు.

## 24న జోగిపేటకు మందకృష్ణ రాక



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు

**చౌటకూరు, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
ఈ నెల 24న వృద్ధుల, వికలాంగుల, వితంతువుల పెన్షన్‌ల పెంపుకై నిర్వహిస్తున్న సభకు మంద కృష్ణమాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పేర్కొన్నారు. మండల కేంద్రమైన చౌటకూరులో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సమన్వయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా పెట్టిన మెనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయాలని, పెన్షన్‌లు పెంచుతామని చెప్పి రెండేళ్లు గడియవస్తున్నా ఆ పెన్షన్‌ల ఊసే ఎత్తడంలేదని ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నమన్వయ కమిటీ సభ్యులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె సంజీవయ్య, నాయకులు ఏర్పుల కృష్ణ, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు, బుచేంద్ర కాకతీయ యూనివర్సిటీ నాయకులు ఎర్రోళ్ల పోచయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు, మాజీ కౌన్సిలర్ సంతోష్, మాజీ ఎంపిటిసి సభ్యులు లింగయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు రమేష్, యాదగిరి, నల్లోల ప్రవీణ్, ప్రశాంత్, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

## వినాయన ప్రతిష్ఠాపనకు అనుమతి తీసుకోవాలి

**నాగల్‌గిద్ద, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
ఆగస్టు 27 జరుపుకునే వినాయక చవితిని పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠాపన చేసుకునే గణనాథుల మండపాల వివరాలను ముందస్తుగా పోలీసుల అనుమతి విధిగా తీసుకోవాలని ఎస్ఐ సూచించారు. గ్రామంలో ప్రతిష్ఠించుకున్న లంబోదరుడి విగ్రహాలు చిన్న,పెద్ద తేడా లేకుండా ప్రతి ఏకదంతుడి మండపాల వివరాలను పోలీసులకు ముందస్తుగా సమాచారం ఇచ్చి అనుమతిపొందాలని మండపాల నిర్వాహకులకు ఎస్ఐ సూచించారు.

## మిర్జాపూర్‌లో ఉల్లాస్ శిక్షణ తరగతులు



శిక్షణాశిబిరంలో మాట్లాడుతున్న ఎంఈఓ మారుతిరాథోడ్

**న్యాల్‌కల్, ఆగస్టు 19, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మిర్జాపూర్(బి) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉల్లాస్ మండల స్థాయి ఒక రోజు శిక్షణ తరగతులను మండల విద్యాధికారి మారుతి రాథోడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మారుతి రాథోడ్ మాట్లాడుతూ వయోజన విద్యపై ప్రాముఖ్యతను వివరించారు. విద్య ప్రతి ఒక్కరికి అవసరమని, అక్షరాస్యత ద్వార సామాజిక మార్పులు సాధ్యమవుతాయన్నారు. ప్రతి గ్రామంలో విఓఏలు, ఉపాధ్యాయులు చైతన్య కార్యక్రమాలు నిర్వహించి అక్షరాస్యతను పెంపొందించాలని మారుతి రాథోడ్ సూచించారు.